క్లుప్తంగా

కేసీఆర్‌కాలనీకి నీటిని విడుదల చేయాలి

ముస్తాబాద్‌: ముస్తాబాద్‌ కేసీఆర్‌కాలనీలో పండుగ రోజు శుక్రవారం నీటికి ఇబ్బందులు పడ్డామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులుగా కేసీఆర్‌కాలనీలో నీటి సమస్య వచ్చిందని పేర్కొన్నారు. 154 బ్లాకుల్లో నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. కాలనీ శివారులోని బోరుబావుల వద్దకు వెళ్లామన్నారు. కాలనీలో నెల రోజులకోసారి నీటి సమస్య వస్తోందని చింతోజు బాలయ్య పేర్కొన్నారు. పండుగ రోజు స్నానాలకు కూడా నీళ్లు లేవన్నారు. శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

నేడు బీఆర్‌ఎస్‌ కార్యకర్తల సమావేశం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని సాయిశివ గార్డెన్స్‌లో శనివారం మండలంలోని బీఆర్‌ఎస్‌ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. రానున్న పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో కార్యకర్తల సమావేశాలు జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కేటీఆర్‌, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌, టిస్కాబ్‌ చైర్మన్‌ కొండూరి రవీందర్‌రావు హాజరవుతున్నట్లు, కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ శాఖ అధ్యక్షులు హాజరు కావాలని కోరారు.

వీర్నపల్లి: మండలంలో శనివారం జరగనున్న ముఖ్య కార్యకర్తల సమావేశానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌ హాజరు కానున్నారని బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకుడు మాడ్గుల మల్లేశం తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ముస్తాబాద్‌: ముస్తాబాద్‌లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ప్రత్యేకాధికారి సురేశ్‌ తెలిపారు. ఎస్సీకాలనీ, ఒడ్డెరకాలనీల్లో పైపులైన్ల నిర్మాణాలు చేపట్టి నీటిని సరఫరా చేసే పనులకు ఆదేశాలిచ్చామన్నారు. వేసవిలో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని అన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు


ట్రాన్స్‌ఫార్మర్‌ ప్రారంభిస్తున్న సుధాకర్‌

బోయినపల్లి: మండలంలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మండల సెస్‌ డైరెక్టర్‌ కొట్టెపెల్లి సుధాకర్‌ పేర్కొన్నారు. రత్నంపేట గ్రామంలో ఓవర్‌ లోడ్‌, లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ప్రారంభించారు. సెస్‌ ఏఈ ప్రశాంత్‌, రైతులు, సెస్‌ సిబ్బంది తదితరులున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సర్దాపూర్‌లో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రజలు

సిరిసిల్లటౌన్‌: కాంగ్రెస్‌ హామీల అమలును హర్షిస్తూ సిరిసిల్ల మున్సిపల్‌ పరిధిలోని సర్దాపూర్‌లో శుక్రవారం ప్రజలు వార్డు కాంగ్రెస్‌ అధ్యక్షుడు మంగ ప్రశాంత్‌, ప్రధాన కార్యదర్శి పల్లె ప్రశాంత్‌గౌడ్‌, ఎస్సీ సెల్‌ జిల్లా కన్వీనర్‌ మంగ కిరణ్‌ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గుగ్గిళ్ల తిరుపతిగౌడ్‌, నీరటి శ్యామ్‌, సలేంద్రి వేణుగోపాల్‌ యాదవ్‌, ఆదిపెల్లి నాగరాజు, అతికం నర్సయ్య, ర్యాకం అనిల్‌, బడుగు భరత్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలి


వెంకటాపూర్‌లో జీరో కరెంట్‌ బిల్లు పథకం ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచిత కరెంట్‌ను నిరుపేదలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లబ్ధి పొందాలని బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్‌ అన్నారు. వెంకటాపూర్‌, పదిర, కోరుట్లపేట, తిమ్మాపూర్‌, రాజన్నపేట, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో శుక్రవారం ఉచిత కరెంట్‌ బిల్లు పథకాన్ని వారు ప్రారంభించారు. కాంగ్రెస్‌ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, సత్యనారాయణ, మందాటి దేవేందర్‌, శ్రీనివాస్‌, దండు శ్రీనివాస్‌, బాబు, బుచ్చాగౌడ్‌, రాములు తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ.. శంభో శంకర..


తంగళ్లపల్లి త్రికూటాలయంలో భక్తులు


రుద్రంగి శ్రీబుగ్గ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం


ముస్తాబాద్‌: మద్దికుంట శివాలయంలో పూజలు

సిరిసిల్లటౌన్‌/గంభీరావుపేట/తంగళ్లపల్లి/బోయినపల్లి/వీర్నపల్లి/కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట/రుద్రంగి/ముస్తాబాద్‌: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం హర నామస్మరణ మార్మోగింది. శైవ క్షేత్రాలు భక్తజనంతో కిటకిటలాడాయి. ఓం నమఃశివాయ అనే పంచాక్షరి మంత్రం జపిస్తూ భక్తులు పారవశ్యం పొందారు. ఉపవాస దీక్ష, జాగరణ చేశారు. సిరిసిల్లలోని పాత బజార్‌, విశ్వనాథ, శివనగర్‌లోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది. భక్తులకు అన్నదానం చేశారు. ఆర్యవైశ్య సంఘం, పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సిరిసిల్ల నుంచి భక్తులు కాలినడకన వెళ్లి వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దర్శనం చేసుకున్నారు.

నారాయణపూర్‌లో స్వామివారి ఊరేగింపు

రాజన్న దత్తత ఆలయం ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌ శివాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు. అంతకు ముందు స్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. మాజీ సర్పంచులు నిమ్మ లక్ష్మి, దొమ్మాటి నర్సయ్య, ఆలయ కమిటీ చైర్మన్‌ సూర నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


వీర్నపల్లి: మహిళల పూజలు


గంభీరావుపేట: జంగమయ్య గుట్టపై పూజలు చేస్తున్న భక్తులు


కోనరావుపేటలో కల్యాణ వేడుకలు


సిరిసిల్లటౌన్‌: పాత శివాలయంలోని శివలింగ దర్శనం


సిరిసిల్లలో..


ఎల్లారెడ్డిపేట శివాలయంలో భక్తుల పూజలు


బోయినపల్లి: వరదవెల్లి హనుమాన్‌ దేవాలయంలో పూజలు

నేటికీ నాటి ఆచారమే..!


పోచెట్టిపల్లి వద్ద ఉన్న పురాతన కోనేరు


కోనేరు వద్ద కొబ్బరికాయలతో పూజలు చేసిన భక్తులు

- రాజన్న దర్శనానికి ముందు ఇక్కడే స్నానాలు
- ఏళ్లుగా వస్తున్న సంప్రదాయం
- సౌకర్యాల్లేక భక్తులకు ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

వేములవాడరూరల్‌: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు ముందుగా ఆ ధర్మగుండంలో స్నానాలు చేసి రాజన్న సన్నిధిలో మొక్కులు చెల్లించుకోవడం నాటి ఆచారం. దశాబ్దాల కాలంగా నేటికీ కొంతమంది ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. వేములవాడ రూరల్‌ మండలం పోచెట్టిపల్లి గ్రామంలో ఉన్న కోనేరు నేటికీ భక్తులకు ఎంతో నమ్మకాన్నిస్తోంది. వేములవాడ రాజన్న ఆలయంలో చాణక్యుల కాలంలో నిర్మించిన ధర్మగుండం కంటే ముందే పోచెట్టిపల్లి నిర్మించినట్లు గ్రామస్తులు చెబుతుంటారు. నిజామాబాద్‌, ఆర్మూర్‌, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రతి శివరాత్రికి వేములవాడకు వచ్చే భక్తులు పోచెట్టిపల్లి కోనేరు వద్ద స్నానాలు చేసేవారు. తదుపరి రాజన్నను దర్శించుకొని వెళ్లేవారని గ్రామస్తులు చెబుతున్నారు. ఎడ్లబండ్లపై వచ్చే భక్తులు ఈ ధర్మగుండం వద్ద స్నానాలు చేసి మూడు, నాలుగు రోజులు ఇక్కడే ఉండి రాజన్న దర్శనానంతరం వెళ్లేవారని తెలిసింది. ఇప్పటికీ అదే సంప్రదాయాన్ని కొంతమంది భక్తులు పాటిస్తున్నా.. ఆ ధర్మగుండం వద్ద మాత్రం వేములవాడ ఆలయ అధికారులు గానీ, పాలకులు గానీ సౌకర్యాలు కల్పించకపోవడంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మా తల్లిదండ్రులకే తెలియదు



ఇక్కడ నిర్మించిన కోనేరు మా తల్లిదండ్రులకు కూడా తెలియదు. నేను చిన్నగా ఉన్నప్పుడు మా తల్లిదండ్రులు అనేవారు. ఇప్పటికీ ఈ ప్రాంతం నుంచి వచ్చే భక్తులు ఇక్కడ స్నానాలు చేస్తున్నారు.

– పూడూరు పోచయ్య, పోచెట్టిపల్లి

సౌకర్యాలు కల్పించాలి



ఈ ధర్మగుండం వద్ద భక్తులు స్నానాలు చేసి వేములవాడకు వెళ్తారు. ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ధర్మగుండాన్ని పట్టించుకునేవారు లేరు. అయినా భక్తులు మాత్రం కోనేరుపై ఎంతో నమ్మకంతో ఇక్కడికి వస్తున్నారు. సౌకర్యాలు కల్పించాలి.

– మల్లవ్వ, పోచెట్టిపల్లి

ఎంతో నమ్మకం



ఈ కోనేరు శిథిలావస్థలో ఉన్నా భక్తులకు ఎంతో నమ్మకం. ఇప్పటికీ ఇక్కడ స్నానాలు చేస్తున్నారు. శివరాత్రికి ప్రతిఏటా ఈ ప్రాంత భక్తులు ఇక్కడ స్నానాలు చేసి కొబ్బరికాయ కొట్టి వేములవాడకు పోతరు.

– సుంక చుక్కయ్య, పోచెట్టిపల్లి

కుక్కల దాడిలో గొర్రెలు, మేకలు మృతి



కోనరావుపేట: కుక్కల దాడిలో కొండాపూర్‌లో గొర్రెలు, మేకలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన బెదిరె రాములు రోజులాగే గొర్రెలు, మేకలను మేపడానికి తీసుకెళ్లాడు. 4 గొర్రె పిల్లలు, 5 మేక పిల్లలను ఇంటి వద్ద దొడ్డిలో ఉంచి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి జీవాలపై కుక్కలు దాడి చేస్తూ కనిపించాయి. కుక్కలను చూసి లబోదిబోమంటూ రోదిస్తూ వెళ్లగొట్టాడు. అప్పటికే 4 గొర్రె పిల్లలు, 5 మేక పిల్లలు మృతిచెందాయి. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

చందుర్తి ఇన్‌చార్జి ఎంపీడీవోగా ప్రదీప్‌కుమార్‌

చందుర్తి: చందుర్తి ఇన్‌చార్జి ఎంపీడీవోగా బండి ప్రదీప్‌కుమార్‌ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న శశికళ మెడికల్‌ లీవ్‌పై వెళ్లారు. చందుర్తి ఎంపీవోగా విధులు నిర్వర్తిస్తున్న ప్రదీప్‌కుమార్‌ను ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వర్తించాలని జెడ్పీ సీఈవో ఉమారాణి ఆదేశాలు జారీ చేశారు.

ఆధ్యాత్మికం

విలాసాగర్‌ శివ కల్యాణానికి రండి


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న కనకయ్య

బోయినపల్లి: విలాసాగర్‌ శ్రీత్రిలింగ సంఘమేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం జరిగే శివ కల్యాణానికి హాజరు కావాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు శుక్రవారం కాంగ్రెస్‌ నాయకుడు ఏనుగుల కనకయ్య ఆహ్వాన పత్రిక అందజేశారు.

కల్యాణ వేడుకలకు రావాలని ఆహ్వానం


లక్ష్మణ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గౌడ సంఘం సభ్యులు

ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్‌లో ఈనెల 11, 12న నిర్వహించే శ్రీరేణుకామాత–జమదగ్ని కల్యాణ వేడుకలకు హాజరు కావాలని గౌడ సంఘం సభ్యులు శుక్రవారం జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్‌ గుండారపు కృష్ణారెడ్డి, పలువురు నాయకులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. హరిదాస్‌నగర్‌లో జెడ్పీటీసీ నివాసానికి వెళ్లి సిద్ధోగం వేడుకలకు రావాలని కోరగా.. తప్పకుండా వేడుకలకు హాజరవుతానని ఆయన చెప్పినట్లు గౌడ సంఘం సభ్యులు తెలిపారు. గౌడ సంఘం ఉపాధ్యక్షులు బొల్గం రాధాకృష్ణగౌడ్‌, శ్రీనివాస్‌గౌడ్‌, అంజాగౌడ్‌ తదితరులున్నారు.

రాజన్న సేవలో బీఆర్‌ఎస్‌ నాయకులు


రాజన్నను దర్శించుకున్న నాయకులు

వేములవాడ: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బీఆర్‌ఎస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు శుక్రవారం రాజన్నను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు.

ఘనంగా మహిళా దినోత్సవం


సిరిసిల్లటౌన్‌: కేక్‌ కట్‌ చేస్తున్న మహిళా డాక్టర్లు, ఉద్యోగులు


తంగళ్లపల్లిలో మహిళలకు సన్మానం

సిరిసిల్లటౌన్‌: అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలు శుక్రవారం సిరిసిల్లలో మిన్నంటాయి. పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, మహిళా గ్రూపుల ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. స్వేరోస్‌ నెట్‌వర్క్‌ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళా వైద్యులు, ఉద్యోగులను సన్మానించారు. కేక్‌ కోశారు. స్వేరోస్‌ జిల్లా అధ్యక్షుడు లింగాల సందీప్‌, ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీకాంత్‌, అందె బాలలక్ష్మి, మస్కూరి సుప్రతిక, అమూల్య తదితరులు పాల్గొన్నారు. వాడవాడల్లో మహిళా గ్రూపులు, కిట్టీ పార్టీ సభ్యులు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ జిందం కళ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

గంభీరావుపేట: గోరింటాలలో ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామైక్య సంఘం మహిళలకు సన్మానం చేశారు. జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, మాజీ సర్పంచులు అంజమ్మ, లతిక, ఎంపీటీసీ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. జగదాంబతండాలో ఉపాధిహామీ కూలీలు ర్యాలీ నిర్వహించారు. ఈజీఎస్‌ టెక్నికల్‌ అసిస్టెంట్‌ భార్గవచారి, ఏపీవో అరుణ, ఎంపీటీసీ కవిత, మాజీ సర్పంచ్‌ బాల్యానాయక్‌ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలవ్యాప్తంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో తాడూర్‌ గ్రామంలో వివిధ రంగాలకు చెందిన మహిళలను సన్మానించారు. మండెపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో వృద్ధులు కేక్‌ కట్‌ చేశారు.

బోయినపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జెడ్పీటీసీ సభ్యురాలు కత్తెరపాక ఉమ అన్నారు. విలాసాగర్‌ గ్రామంలో మహిళలతో కలిసి కేట్‌ కట్‌ చేశారు. మాజీ సర్పంచ్‌ జూలపల్లి స్వప్నాంజలి తదితరులున్నారు.


బోయినపల్లి: కేక్‌ కట్‌ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఉమ


గంభీరావుపేట: మహిళలకు సన్మానం చేస్తున్న జెడ్పీటీసీ

మహిళలు స్వశక్తితో ఎదగాలి


మహిళలతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్‌

బోయినపల్లి: మహిళలు స్వశక్తితో ఎదిగి సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని కరీంనగర్‌ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌ అన్నారు. కరీంనగర్‌ నుంచి సిరిసిల్ల సమావేశానికి వెళ్తున్న క్రమంలో వెంకట్రావుపల్లి రోడ్డు పక్కన టిఫిన్‌ సెంటర్‌ నిర్వహిస్తున్న మహిళల వద్ద శుక్రవారం కొద్దిసేపు ఆగారు. వారితో మాట్లాడుతూ హోటల్‌ ఎన్ని రోజులుగా నిర్వహిస్తున్నారని, ఎంత ఆదాయం వస్తుందని వాకబు చేశారు. మరొకరిపై ఆధారపడకుండా ఉండేందుకు మూడేళ్లుగా టిఫిన్‌ సెంటర్‌ నిర్వహిస్తున్నట్లు మహిళలు తెలిపారు. తన కూతురును అగ్రహారంలో పాలిటెక్నిక్‌ చదివించానని, బీటెక్‌ చేయిస్తానని పేర్కొంది. స్వశక్తితో హోటల్‌ నిర్వహిస్తూ మహిళలకు ఆదర్శంగా నిలిచారని అభినందించారు. వారికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

అయ్యప్పస్వామి ఆలయానికి విరాళం

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో నిర్మిస్తున్న శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయానికి జవారిపేట గ్రామానికి చెందిన చీర్లవంచ రాజేందర్‌ శుక్రవారం రూ.21,016 విరాళం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు రాజేందర్‌ను అభినందించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా :
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899